క్లుప్తంగా

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం లో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం విజయవాడకు చెందిన చింతా వెంకట శివరామకృష్ణ కుమార్ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచ హారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై అక్షిత, చంద్రిక, వైష్ణవి, సాయి, హారిక, యశ్విని, జాన్విక, లిఖితశ్రీ, గ్రీష్మలతోపాటు పలువురు చిన్నారులు అఖిలాండేశ్వరి..చాముండేశ్వరి...! కొలువైతివా.. వంటి కీర్తనలకు చక్కటి హావభావాలతో కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందించారు.

అసమర్థ నాయకుడు పవన్‌కళ్యాణ్

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): తాను పోటీ చేసే స్థానాన్ని సైతం ప్రకటించుకోలేని అసమర్థ నాయకుడు పవన్ కళ్యాణ్ అని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొలిమెట్ల శరత్‌బాబు విమర్శించారు. పెజ్జోనిపేటలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఒంటరిగా 175 స్థానాల్లో పోటీ చేయలేని జనసేన ఒంటరిగా ఏనాడూ గెలవలేని టీడీపీతో పొత్తు కుదుర్చుకొని పోటీ చేసే స్థాయికి దిగజారిందన్నారు. రాష్ట్రంలో 24 స్థానాల్లో పోటీ చేస్తామని గొప్పగా చెబుతున్న పవన్ కళ్యాణ్ ఐదు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించి తాను మాత్రం ఎక్కడ నుంచి పోటీ చేసేది వెల్లడించకపోవటం చూస్తుంటే గత ఎన్నికల్లో మాదిరిగా తాను గెలవలేనన్న విషయం ఆయనకు అర్థమైనట్లు ఉందన్నారు.

చిన్నారులకు ఆసిఫ్ అభినందనలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): సైన్స్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు సైన్స్ రంగంపట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ తెలిపారు. భవానీపురం శివాలయం రోడ్‌లోని నెల్లూరు రవీంద్రభారతి పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో ప్రదర్శనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల ప్రాజెక్ట్స్ నమూనాలను ఆసక్తిగా తిలకించి చిన్నారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ విద్యార్థులలో అంతర్లీనంగా దాగి ఉన ప్రతిభను వెలికితీయటానికి ఇటువంటి ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాలను గుర్తించి వాటిల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని స్కూల్ యాజమాన్యానికి సూచించారు. ముఖ్యంగా శాస్త్రీయ విజ్ఞాన రంగంపట్ల చిన్నారుల్లో అవగాహన కల్పించి పరిశోధనల దిశగా తీసుకువెళ్లి బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రముఖ శాస్త్రవేత్తలు అల్బర్ట్ న్యూటన్, ఐనస్టన్, మేరియో క్యూరీ వంటివారిని స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేయాలని చిన్నారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పడిగపాటి చైతన్య రెడ్డి, యలకల చలపతిరావు, పాఠశాల జనరల్ మేనేజర్ శివారెడ్డి, డీన్ శ్రీకాంత్, ఏజీఎమ్ కేశవరాజు, ప్రిన్సిపాల్ రాధ, ఇన్‌చార్జ్ రాఘవులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ వినియోగంపై అవగాహన



భవానీపురం(విజయవాడపశ్చిమ): వంట గ్యాస్ వాడకంలో మహిళలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉంటే తద్వారా తమతోపాటు కుటుంబసభ్యులను కూడా సురక్షితంగా ఉంచినవారవుతారని గ్యాస్ మెకానిక్‌లు అన్నారు. విద్యాధరపురంలోని నాలుగు స్తంభాల సెంటర్‌లో శనివారం భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ అయిన శ్రీభవానీ గ్యాస్ కంపెనీ అధినేత గద్దె శ్రీహరిబాబు ఆధ్వర్యంలో సేఫ్టీ క్లినిక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ కంపెనీ మెకానిక్‌లు సాయి, ఆసిఫ్ మాట్లాడుతూ సురక్షితంగా వంట గ్యాస్‌ను ఎలా వినియోగించాలనే విషయమై మహిళలకు అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ డెలివరి తీసుకునే సమయంలో వినియోగదారుల బిల్లుపై ఉన్న మొత్తాన్ని మాత్రమే చెల్లించాలని, అలాగే బరువు సరిగా ఉన్నదీ లేనిదీ సరిచూసుకోవాలని సూచించారు. అదే విధంగా గ్యాస్ సిలిండర్ వచ్చినప్పుడు డెలివరి బాయ్ వద్ద ఉండే కిట్లతో సిలిండర్ వాషర్, వాల్ లీకులను తనిఖీ చేసుకోవడం మంచిదని చెప్పారు. గ్యాస్ లీకవుతుందని అనుమానం వస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1906ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో డెలివరీ బాయ్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు

- వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆసిఫ్
- 44వ డివిజన్‌లో విస్తృత పర్యటన



ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుస్తున్న ఆసిఫ్, భాగ్యలక్ష్మి, రత్నకుమారి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ తెలిపారు. 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు ఆధ్వర్యంలో శనివారం ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక పార్టీ నాయకులతో కలిసి విద్యాధరపురం లేబర్‌కాలనీలో విస్తృతంగా పర్యటించారు. కాలనీలోని గడప గడపకు తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు తీరు, అభివృద్ధి పనుల గురించి స్థానిక మహిళలను ఆరా తీసినప్పుడు వారందరూ సంతోషం వ్యక్తం చేశారు. అభివృద్ధి అంటే సీఎం జగనన్న ప్రభుత్వంలోనే చూశామని చెప్పారు. అలాగే వివిధ సంక్షేమ పథకాల ద్వారా వేలాది రూపాయల లబ్ధి పొందుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో ఏ పని కావాలన్నా లంచం లేనిదే జరిగేది కాదని, సీఎం జగన్ పారదర్శక పాలనలో అవినీతికి తావు లేకుండా జరిగిపోతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలతోపాటు వైద్య సేవలూ ఇంటి ముంగిటకే తీసుకొచ్చిన ఘనత సీఎం జగనన్నదేనని పేర్కొన్నారు.

విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు....

కుల, మత, వర్గం, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని పేర్కొన్నారు. జగనన్నది ప్రజా ప్రభుత్వమని, ఇక్కడ ప్రజాపక్షం తప్ప ప్రతిపక్షం లేదని స్పష్టం చేశారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. విద్యారంగంలో ఆయన తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలతో పాఠశాలల్లో డ్రాపవుట్స్ తగ్గటమే కాకుండా అడ్మిషన్ దొరకని పరిస్థితి నెలకొందన్నారు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాల ఫలితంగా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకుంటున్నారని తెలిపారు. విద్యారంగాన్ని ఇంతగా అభివృద్ధి చేసిన సీఎం జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 175 స్థానాల్లో విజయం సాధించడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా మేలు జరిగిందనుకుంటేనే వచ్చే ఎన్నికల్లో ఓటెయ్యాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి కోరారు. ఆ విధంగా ధైర్యంగా చెప్పగలిగిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వెయ్యి రూపాయల ఖర్చు దాటిన ప్రతి రోగాన్ని ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చి అన్ని వర్గాల ప్రజలను ఆర్థికంగాను, ఆరోగ్యపరంగాను ఆదుకుంటున్న మంచి మనసున్న మనిషి సీఎం జగనన్న అన్నారు. అటువంటి నాయకుని కోసం ఎదురు చూస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయంతో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్, ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, గుడివాడ నరేంద్ర రాఘవ, ఎండీ ఇర్ఫాన్, పి.చైతన్యరెడ్డి, పార్టీ నాయకులు మైలవరపు దుర్గారావు, ఎద్దు సురేష్, వల్లం రవికుమార్, పెద్ది రాజారావు, శర్మ మాస్టారు, షఫీఉల్లా, ఎ.పూర్ణకనకారావు, వి. సుబ్బారావు, ఉస్మాన్ బేగ్, ఎస్‌కె జిలాని, రియాజ్, కేసరి చిన్నోడు, శేఖర్‌రెడ్డి, బూదాల శ్రీను, విశ్వనాథ రవి, బాషి, సుభానీ ఖాన్, కామళ్ల జోజి, నన్నం దుర్గ, మజ్జి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి వివరించాలి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్



సిద్ధం అంటూ పోస్టర్లను ప్రదర్శిస్తున్న బూత్ కన్వీనర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావటం ద్వారా ఏపీ మరింత అభివృద్ధి చెందుతుందని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో విజయాన్ని సాధించేందుకు బూత్ కన్వీనర్లు కృషి చేయాలని కోరారు. పశ్చిమ నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 46, 47, 48, 49, 51 డివిజన్ల బూత్ కన్వీనర్లు సమావేశం స్థానిక పంజా సెంటర్‌లోని హాజీయా ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆసిఫ్ మాట్లాడుతూ మరో కొద్ది రోజుల్లో రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకిచ్చిన హామీలు 98 శాతం నిలబెట్టుకొని తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని చెప్పారు. 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలకు ఆరు వందల హామీలిచ్చి ఒక్కదానిని కూడా నిలబెట్టుకోలేదన్నారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబును 2019 ఎన్నికల్లో ప్రజలు తరిమికొట్టారని తెలిపారు. గడిచిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవటం ద్వారా రాష్ట్రానికి మరింత మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. బూత్ కన్వీనర్లు ఎన్నికల వరకూ ఉత్సాహంగా పని చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, బుల్లా విజయకుమార్, నాయకులు అత్తులూరి పెదబాబు, గోదావరి బాబు, బుద్దా రాంబాబు తదితరులు ప్రసంగించారు.

ఫార్మా విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్ వి.చెన్నుపాటి

రామవరప్పాడు: మానవాళికి ఉపయోగపడే సమర్థవంతమైన ఔషధాలు తయారు చేయగలగడానికి ఫార్మా రంగ విద్యార్థులు పరిశోధనాత్మకతపై దృష్టి సారించాలని డాక్టర్ సురేష్ వి.చెన్నుపాటి అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు విజయ ఫార్మసీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న 18వ అంతర్జాతీయ ఇండో మలేషియన్ సదస్సు శనివారంతో ముగిసింది. 'ఔషధ రంగంలో ప్రపంచ స్థాయి సవాళ్లు – భవిష్యత్ ప్రణాళికలు' అనే అంశంపై అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్స్ ఆంధ్రప్రదేశ్ శాఖ, అంతర్జాతీయ మలేషియా శాఖ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు సూక్ష్మమైన విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిశోధనలు చేయాలని సూచించారు. హైదరాబాద్, చెన్నై నుంచి వచ్చిన ప్రొఫెసర్లు షణ్ముఖ సుందరం, సోమనాథ్ డేలు మాట్లాడుతూ.. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇనుమడింపజేసుకుని సమర్థవంతంగా పని చేసే ఔషధాలను పరిశోధించాలన్నారు. అనంతరం ఈ సదస్సులో విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రయోగాలను పరిశీలించి బహుమతులు అందజేశారు. సదస్సులో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు, అధ్యాపక బృందం, పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయంతోనే సమాజాభివృద్ధి సాధ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సామాజిక న్యాయంతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం అన్నారు. లెనిన్ సెంటర్‌లోని బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యాన శనివారం దళిత, ఆదివాసీలు, బాలికలపై హింసకు వ్యతిరేకంగా రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో జ్యూరీ నిర్వహించారు. జ్యూరీ సభ్యులుగా రిటైర్డ్ జడ్జిలు జయరాజ్, జేసురత్నకుమార్, ఎస్సీ పీసీఆర్ సభ్యుడు రాజేంద్రప్రసాద్, ఎస్టీ అసోసియేషన్ జాతీయ సభ్యులు శ్రీనివాస్‌నాయక్, రత్నప్రదీప్, ప్రొఫెసర్ కుమార్ వ్యవహరించారు. 20 కేసుల వివరాలతో జ్యూరీ కిట్ రూపొందించి దళిత స్త్రీ శక్తి జ్యూరీకి అందజేసింది. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ దళితులు, ఆదివాసీలపై అత్యాచారాలు, హింస జరగడం దారుణమన్నారు. హింస, కుల వివక్షకు మూల కారణాలను గుర్తించి రూపుమాపాలన్నారు. రిటైర్డ్ జడ్జి జయరాజు మాట్లాడుతూ దళిత, ఆదివాసీ స్త్రీలు చైతన్యవంతులు కావాలన్నారు. జేసురత్నకుమార్ మాట్లాడుతూ కేసుల్లో నిందితులకు శిక్షలు పడాలంటే బాధితులు ధైర్యంగా ముందుకు రావాలని సూచించారు. సమావేశంలో దళిత స్త్రీ శక్తి ప్రతినిధులు, బాధితులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష



ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేస్తున్న డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలను వేగవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని వైద్యాధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో శనివారం ఆమె గ్రామీణ, పట్టణ ప్రాంత వైద్యాధికారులు, పర్యవేక్షకులు, ఏఎన్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సుహాసిని మాట్లాడుతూ ఆర్‌సీహెచ్ పోర్టల్ అప్డేట్, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ మిషన్‌లో భాగంగా ఆరోగ్య సిబ్బంది హెల్త్ పర్సనల్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మొదటివిడతతో వైఎస్సార్ కంటి వెలుగు సేవల్లో భాగంగా కళ్లజోళ్లు, ఆరోగ్య శ్రీ కొత్త కార్డులు, ఆరోగ్యశ్రీ బ్రోచర్లను వెంటనే పంపిణీ చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో తక్కువ ప్రగతి సాధించిన సిబ్బంది పనితీరును వ్యక్తిగతంగా సమీక్షించారు. ప్రగతి సాధించని వారిపై తగు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, ఎన్‌హెచ్‌ఎం డీపీయంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కబేళా విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగ కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఇండస్ట్రియల్ ఏరియా, కబేళా సెంటర్, ఊర్మిళానగర్, జోజినగర్, పోలీస్ కాలనీ, టెలిఫోన్ కాలనీ, సితార సెంటర్, లేబర్‌కాలనీ, మిథిలానగర్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, చెరువు సెంటర్, మర్రిచెట్టు సెంటర్, పెద్ద సాయిబాబా గుడి ఏరియా, రైతుబజార్ రోడ్, లలితానగర్, మానవ మందిరం రోడ్, టీవీ కృష్ణారావు వీధి తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని ఆయన వివరించారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖతో సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న వీరమ్మ తల్లి తిరునాళ్ల



ఉయ్యూరు: అమ్మా.. వీరమ్మా.. మము బ్రోవుమమ్మా.. అంటూ భక్తులు చల్లని తల్లికి పూజలు జరిపించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వీరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. అమ్మవారిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పసుపు, కుంకుమలు సమర్పించారు. మహిళలు పాలపొంగళ్లు సిద్ధం చేసి నైవేద్యం సమర్పించారు. పొట్టేళ్లను మొక్కుబడిగా సమర్పించారు. సంతానం ప్రాప్తించాలని మహిళలు అమ్మవారి సన్నిధిలో పానాచారం చేశారు. బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు జరిపించారు. ఆలయ కమిటీ అమ్మవారి ప్రసాదాలను అందించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ప్రసాదం పంపిణీని మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ(నాని) ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంకిపాడుకు చెందిన వి.వంశీకృష్ణ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తాడు. విజయవాడ నుంచి కంకిపాడుకు బైక్‌పై వస్తుండగా గోసాల చైతన్య కాలేజీ సమీపంలో వన్‌వేలో ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతనికి బలమైన గాయాలయ్యాయి. విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వంశీకృష్ణ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దస్తావేజు లేఖర్ల పరిరక్షణ సమితి కార్యవర్గ ప్రమాణ స్వీకారం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా దస్తావేజులేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి నూతన కార్యవర్గం ఎన్నికైంది. గాంధీనగర్‌లోని శ్రీపాద హోటల్‌లో శనివారం కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. సమితి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా పైలా సతీష్, ఉపాధ్యక్షుడిగా కొండపల్లి మురళి, ఆరేపల్లి విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మాడపాటి కృష్ణ కిషోర్, సంయుక్త కార్యదర్శులుగా పోపూరి నరేష్, యరమాల ఉమామహేశ్వరి, కోశాధికారిగా కొమ్మూరు వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గోనెల దిలీప్ కుమార్, సభ్యులుగా క్షత్రి సత్యనారాయణ సింగ్, కొమ్మూరు వెంకట్రావు షేక్ మీరావలి ప్రమాణం చేశారు. కమిటీ మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతుంది. నూతన కార్యవర్గానికి రాష్ట్ర కమిటీ ప్రతినిధులు తుమ్మల హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి గుంటి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు నేరేళ్ల జ్ఞాన సత్య వెంకట నారాయణ, కోశాధికారి చింతకాయల నాగ సత్యనారాయణమూర్తి , పలువురు దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్స్ అభినందనలు తెలిపారు.

నేత్రపర్వంగా శ్రీవారి తెప్పోత్సవం



తెప్పోత్సవంలో స్వామివారు



స్వామివారి శ్రీచక్ర తీర్థస్నాన మహోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వేంకటేశ్వరస్వామి వారి చక్రతీర్థ స్నానం పవిత్ర కృష్ణానదిలో శనివారం ఉదయం అత్యంత నేత్రపర్వంగా జరిగింది. వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం ఉదయం స్వామి వారికి వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో రంగులు పూసుకుంటూ శ్రీహరి నామస్మరణ మధ్య శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో కృష్ణానది ఒడ్డున దుర్గాఘాట్‌కు తీసుకెళ్లారు. అక్కడ స్వామి వారి చక్రతీర్థ స్నాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి జైశ్రీమన్నారాయణ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. ప్రముఖ ఆగమ పండితులు ఆలయ ప్రధాన అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వైభవంగా తెప్పోత్సవం...

సాయంత్రం ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవమూర్తులను కృష్ణానదికి తీసుకెళ్లారు. అక్కడ నది ఒడ్డున స్వామి వారి తెప్పోత్సవాన్ని నయనానందకరంగా నిర్వహించారు. పర్యాటక శాఖకు చెందిన విజయసిరి వాహనంపై రమణీయంగా పూల, విద్యుత్ అలంకరణ గావించారు. అనంతరం ఆలయం నుంచి మేళతాళాలతో తీసుకెళ్లిన ఉత్సవమూర్తులను ప్రత్యేక ఆసనంపై ఆదిష్ఠింపజేసి పూజలు నిర్వహించారు. ఒకవైపు మేళతాళాలు, మరోవైపు భజన బృందాల భజనలు, పండితుల వేదనాదాల మధ్య మూడు సార్లు కృష్ణానదిలో ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం ధ్వజ అవరోహణ చేశారు.

ఘనంగా అశ్వవాహన సేవ....

ఆలయ ప్రాంగణంలో అశ్వవాహనంపై ఊరేగిన స్వామివారికి తిరుమంగై ఆళ్వార్ చోర సంవాదం నిర్వహించారు. చోరసంవాద కార్యక్రమాలను అర్చకస్వాములు చక్కగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు. వైదిక కార్యక్రమాలను శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు. విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు తదితరులు పాల్గొన్నారు.

కేబీఎన్ కళాశాలను పరిశీలించిన నాక్ బృందం



మాట్లాడుతున్న ఆచార్య మునిరాజు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాకరపర్తి భావనారాయణ కళాశాలను నాక్ బృందం ఈ నెల 22, 23 తేదీల్లో పరిశీలించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. యునివర్శిటీ గ్రాంట్ కమిషన్ ఆధ్వర్యంలోని నాక్ (నేషనల్ అసిస్మెంట్ అండ్ అక్రిడెటేషన్ కౌన్సిల్) ప్రతి ఐదు సంవత్సరాలకు కళాశాలలను పరిశీలించి ఆ విద్యాసంస్థ పనితీరుపై గ్రేడ్‌ను ప్రకటిస్తుందని పేర్కొన్నారు. తమ విద్యాసంస్థను నాలుగో సారి నాక్ బృందం పరిశీలించిందని తెలిపారు. మంగుళూర్ విశ్వవిద్యాలయం (కర్ణాటక)కు చెందిన ఆచార్య వై.మునిరాజు చైర్మన్‌గా, గౌహతి విశ్వవిద్యాలయం (అస్సాం)కు చెందిన ఎస్. కుమార్‌శర్మ, సుగుణ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ కోయంబత్తూర్ (తమిళనాడు)కు చెందిన డాక్టర్ కిట్టప్ప వైద్యనాథన్‌లు సభ్యులుగా నాక్ సంస్థ నియమించి తమ కళాశాలకు పంపించినట్లు పేర్కొన్నారు. ఈ బృందం రెండు రోజుల పాటు కళాశాలలోని అన్ని విభాగాలను పరిశీలించినట్లు తెలిపారు. యజమాన్యం, అడ్మినిస్ట్రేషన్, బోధనా పద్ధతులు, సామాజిక సేవలు, అధ్యయనం, వసతులు, సదుపాయాలు ఇలా వివిధ అంశాలను పరిశీలించారని వెల్లడించారు. విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు తదితరులతో వేర్వేరుగా సమావేశమై చర్చించినట్లు వివరించారు.

గురువులు ప్రపంచానికి మార్గదర్శకులు

గురువులు ప్రపంచానికి మార్గదర్శకులు అని ఆచార్య వై.మునిరాజు అన్నారు. పరిశీలన అనంతరం జరిగిన ముగింపు సమావేశంలో ఆచార్య మునిరాజు మాట్లాడుతూ గురువులు మరింత సమర్థవంతంగా విద్యార్థులకు బోధనను అందించాలని కోరారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దటంతో పాటుగా పరిశోధనలో మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసు, కోశాధికారి అన్నం రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మహతీశంకర్ సేవలు వెలకట్టలేనివి



సాహితీ నీరాజనం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న పింగళి వెంకట కృష్ణారావు, గోళ్ళ నారాయణరావు తదితరులు

విజయవాడ కల్చరల్: డాక్టర్ జంధ్యాల మహతీ శంకర్ తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు వెలకట్టలేనివని పోలవరపు కోటేశ్వరరావు కళాసమితి సమితి వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు అన్నారు. రసభారతి, జీఆర్‌కే పోలవరపు కళాసమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం డాక్టర్ జంధ్యాల మహతీ శంకర్ సాహితీ నీరాజనం గ్రంథ ఆవిష్కరణ నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ మహతీ శంకర్ పండిత కుటుంబానికి చెందిన వారన్నారు. అధ్యాపకునిగా పని చేస్తూనే అనేక అవధానాల్లో పాల్గొన్నారని చెప్పారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ సుదీర్ఘకాలం పరిశోధన చేసి దేశీ భాషలతో పాటు 12 భాషల్లో ప్రావీణ్యమున్న వేలూరి శివరామశాస్త్రి కృతులమీద పరిశోధన చేసి డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. విశ్రాంత అధ్యాపకులు పింగళి వెంకట కృష్ణారావు గ్రంథాన్ని ఆవిష్కరించారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్ , సాహితీవేత్తలు పొన్నలూరి లక్ష్మణరావు, డాక్టర్ జీవీ పూర్ణచందు, డాక్టర్ క్రోవి పార్థసారథి, ఉయ్యూరు సాంబిరెడ్డి, డాక్టర్ కావూరి సత్యవతి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ మహతీశంకర్ సాహితీ ప్రస్థానం అంశంగా ప్రసంగించారు. జంధ్యాల మహతీ శంకర్ సాహితీ సేవలను వివరించారు. రసభారతి ప్రధాన కార్యదర్శి డాక్టర్ జంధ్యాల పరదేశిబాబు నిర్వహించారు. నగరానికి చెందిన పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

తెలుగుభాషను పరిరక్షించుకోవాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తెలుగు భాషకు సాంకేతికతకను సమన్వయం చేస్తూ నేర్చుకోవడం ద్వారా ఎన్నో ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు, హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు గారపాటి ఉమామహేశ్వరరావు చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో తెలుగు భాష పరిరక్షణ–భాషా శాస్త్ర పరిచయం అనే అంశంపై సదస్సు కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో శనివారం నిర్వహించారు. ఉమామహేశ్వరరావు వక్తగా హాజరై మాట్లాడుతూ తెలుగు భాషలో మాధుర్యం ఉంటుందన్నారు. ఉద్యోగం కోసం ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను తప్పని సరిగా నేర్చుకోవాలని చెప్పారు. తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తెలుగుభాష గొప్పతనాన్ని తెలుసుకొని విదేశీయులు నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. ఇతర దేశాల్లోని వారు మొదటిగా వారి మాతృభాషను నేర్చుకోడానికి అధిక ప్రాధాన్యం ఇస్తారని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మాట్లాడుతూ నేటి యువతలో తెలుగు భాషపై మమకారం తగ్గిపోతుందన్నారు. ఇటువంటి సమయంలో తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేసి వారికి తెలుగు భాషపై ఆసక్తిని కలిగించడానికి ఇలాంటి సదస్సులు దోహదం చేస్తాయన్నారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ మాతృభాషను ప్రతి ఒక్కరూ తప్పని సరిగా నేర్చుకోవాలన్నారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ ఎన్.శివకుమార్, అధ్యాపకులు పి.నీరజ, ఏవీ.రమణమూర్తి, పి.బలరాంతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు.